# ఏదోదారి

భానుమూర్తి



ఆఫీసు పని మీద సికింద్రాబాద్ బయలుదేరాను. స్టేషన్ చేరుకునేసరికి ఏడయింది. అప్పుడే గుంటూరు నుంచి వచ్చి ఆగింది గోల్కొండ ఎక్స్‌ప్రెస్. ఇంకా ఎలా లేదన్నా బయలుదేరేందుకు పావుగంటయినా పడుతుంది. దినపత్రిక తీసుకుని చూస్తూ నుంచున్నా. పేపర్ చూడటంతో పాటు, అప్పుడప్పుడు ప్లాట్‌ఫాం మీదకు దృష్టిని సారిస్తున్నా, చాల సందడిగా వుంది స్టేషన్. విజయవాడ ఎప్పుడూ యింతే. అందునా పుష్కరాల హడావుడి, స్టేషన్ ఈనుతోందా అన్నట్లుగా వున్నారు జనం. మెట్ల మీది నుండి క్రిందకు దిగివచ్చే వాళ్లను చూస్తున్నాను. అందులో ఒకమ్మాయి తొందర తొందరగా మెట్లు దిగివస్తూ కనిపించింది. సరిగ్గా నేను నుంచున్న బోగీ దగ్గర కొచ్చి ఆగింది. చేతిలో వైరుతో అల్లిన బాగ్. దానిలో వున్న పర్స్ నుండి టికెట్ బయటకు తీసి చూసుకుంది. మళ్ళీ దాన్ని పర్స్‌లో పెట్టి, పర్స్ బాగ్‌లో పడేసింది ...

సిగ్నల్ యిచ్చారు, ట్రెయిన్ బయలుదేరేందుకు సిద్ధంగా వుంది. పేపర్ మడిచి జనాన్ని తోసుకుంటూ వెళ్ళి నా సీట్లో కూర్చున్నాను. రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్స్ కూడా జనరల్ కంపార్ట్‌మెంట్స్‌లా తయారయ్యాయి. అంతకు ముందు నేను చూసిన ఆ అమ్మాయి విండో ప్రక్క సీట్లోకి వచ్చి కూర్చుంది. పద్దెనిమిదేళ్లుంటాయేమో. కళ్లల్లో మంచి ఆకర్షణ వుంది. పల్లెటూరు పడుచయినా, పట్నంలో మసలే వ్యక్తిలా బిహేవ్ చేయాలన్న ఆరాటం కన్పిస్తోంది. బాగ్ పక్కన పెట్టుకుంది. చూడబోతే ఆమెతో ఎవరూ వస్తున్నట్లు లేదు. విండో గ్లాస్ పైకెత్తి బయటకు చూస్తూ కూర్చుంది. పేపర్‌లో నుంచి ఆమెను గమనిస్తూ వుండిపోయాను. ట్రెయిన్ డోర్నకల్ దాటాక కాఫీకి ఆర్డరిచ్చాను. ట్రెయిన్‌లో సర్వ్ చేసే కాఫీ బాగా లేకున్నా, అందరితో పాటు నాకూ తాగాలనిపించింది. ఆమె కూడ కాఫీకి ఆర్డరిచ్చింది.

కాఫీ తాగి రూపాయి నోటిచ్చి చిల్లర తీసుకున్నాను.

ఆమె కప్పు కింద పెట్టి డబ్బులిచ్చేందుకు బ్యాగ్ నుండి పర్స్ తీయబోయింది. పర్స్ కనిపించలేదు. ఆమె షాక్ తిన్నది. కంగారుగా బ్యాగంతా వెతికింది. ఒకటికి రెండు సార్లు మళ్ళీ కలయ జూసింది. నాతో పాటు అక్కడ కూర్చున్న వాళ్లందరూ ఇది గమనిస్తూనే వున్నారు. ఆమె ముఖంలో కంగారుతో పాటు, భయం చోటు చేసుకుంది...

''ఏమ్మా ఏమయింది'' అడిగాడొకాయన.

''పర్స్ కనిపించటంలేదండి'' హీన స్వరంతో అన్నది.

''ఎక్కడ పెట్టావ్'' మరొకతను.

''బాగ్‌లో పైనే పెట్టాను.''

''ఇంకేం, ఎక్కేముందు ఎవరో కొట్టేసుంటారు.''

''అయినా పర్స్ పైన పెట్టుకుంటారా'' తలొక మాట.

"జాగ్రత్తగా బ్యాగంతా చూడండి" అన్నాను నేనూ కలుగజేసుకుంటూ.

దాంట్లో వున్న బట్టలు ప్రక్కన పెట్టి, అన్నీ దులిపి చూసింది. కనుపించలేదు.

ఇది విని, ప్రక్క వరుసలో కూర్చున్న వాళ్ళు కూడ అక్కడకు వచ్చి చేరారు.

"ఏమయింది, ఏమయింది"

"పర్సు పోయిందిట"

"ఎవరిది?"

"అదిగో ఆ అమ్మాయిది"

అందరూ ఆమె వంక చూశారు.

"ట్రెయిన్ ఎక్కేముందు త్రోవలో యేమయినా పడిందేమో చూడమనండి" అందులో ఒకాయన అన్నాడు.

ఆ అమ్మాయి లేచి అంతా చూసి వచ్చింది. ఎక్కడాలేదు. సీటు దగ్గరకొచ్చి అలాగే నిలుచుండి పోయింది.

"అసలు పర్సు బ్యాగ్‌లోనే పెట్టావా?"

"అవును. ఎక్కేముందు కూడ వుంది" అంది.

"పర్సులో ఎంతుందేమిటి?"

"యాభై రూపాయలు" దిగాలుగా చెప్పింది.

"టికెట్ కూడ అందులోనే వుంది" మళ్ళీ ఆమే అంది.

"అయ్యో!"

ఆల్చిప్పల్లాంటి ఆ కళ్ళల్లో కన్నీళ్ళు చోటు చేసుకున్నాయ్; క్రింద పడేందుకు సిద్ధంగా వున్న వాటిని, ఆమె కర్చీఫ్‌తో అద్దుకుంది. అంతవరకూ మిల మిలా మెరుస్తున్న ఆ కళ్ళు అలా కావటం బాధనిపించింది. దీనంగా వున్న ఆమె ముఖం చూస్తే జాలి పుట్టుకొచ్చింది ... కాఫీ డబ్బుల కోసం వచ్చినతను పరిస్థితి తెలుసుకుని, కప్పు తీసుకుని వెళ్ళిపోయాడు.

"ముంచునే వున్నావ్, కూర్చో" అన్నదొకామె.

ఆ అమ్మాయి కూర్చుంది.

"ఎక్కడిదాక వెళ్ళాలి మీరు" అడిగాను.

"హైదరాబాద్"

"ఎక్కడ్నుంచి వస్తున్నారు" ఎవరో అడిగారు.

చెప్పింది.

"నీతో ఎవరూ రావటంలేదా అమ్మాయ్" ఓ తాతగారు అడిగారు.

"లేదు ఒక్కదాన్నే ..." భయంగా చూస్తూ అంది.

"ఇదే మొదటిసారా హైదరాబాద్ వెళ్ళటం"

"ఇంతకు ముందొకసారి చూసా" తలొంచుకుని చెప్పింది.

"స్టేషన్‌కు ఎవరయినా వస్తున్నారా"

"లేదు...అన్నయ్య దగ్గరకు వెళుతున్నా. ఇంటి అడ్రెస్ తెలుసు" అంది.

"టికెట్ కూడ పోయింది పాపం-టి.సి. వస్తే ఎలాగ" అన్నారెవరో.

ఆమె భయంగా, దిగులుగా తలొంచుకుని, కిందకు చూస్తూ కూర్చుంది. 'ఎంత పని జరిగిపోయింది' అన్న విచారం ఆమెలో కన్పిస్తోంది —

ఇంతలో నా కుడి ప్రక్కన కూర్చున్నతను లేచాడు. మనిషి తెల్లటి ధోవతి కట్టుకున్నాడు: తెల్లటి లాల్చీ, పైన కండువా, పెద్దమనిషిలా, వున్నవాడిలా వున్నాడు. లాల్చీ జేబునుంచి పది రూపాయల నోటు తీసి, "ఇది నీ చేతి ఖర్చులకి వుంచమ్మాయ్" అంటూ అందివ్వబోయాడు. ఆమె తీసుకోలేదు బిడియపడుతోంది అటువంటి పరిస్థితి వచ్చినందుకు కుంచించుకుపోతోంది.

"ఫరవాలేదు ఉంచమ్మాయ్" అన్నాడాయన మళ్ళీ.

పక్కన ఎవరో "తీసుకోమ్మా" అన్నారు.

తననుండి తీసుకునేందుకు ఫీలవుతున్నదేమోనని, ఆమె కెదురుగా కూర్చున్నామెకిచ్చి, ఆ పది రూపాయల నోటు ఆ అమ్మాయి కివ్వమని చెప్పాడు. ఆమె అది తీసుకుని ఆ అమ్మాయి చేతిలో పెడుతూ; "ఉంచమ్మాయ్" అంది. చేతిలో వుంచిన నోటు చూస్తూ అలాగే కూర్చుంది ఆమె. ఆమె పరిస్థితి నాకూ జాలి గొలిపింది.

"మీరేం ఆదుర్దా పడకండి. టి. టి ఇ. నాకు తెలిసినవాడే. హైదరాబాద్ వెళ్ళేవరకూ మీకేం బాధలేదు" అన్నాను

ఆమె కళ్ళెత్తి నా వేపు చూసింది.

"ఇది కూడా వుంచండి" అంటూ వో అయిదు రూపాయల నోటు తీసి ఆమె కెదురుగా కూర్చున్నామెద్వారా ఆ అమ్మాయికి యిప్పించాను. అక్కడున్న వారిలో ఇది చూస్తున్న కొందరు తమకు తోచింది ఆ అమ్మాయి చేతిలో పెట్టారు. అంతా కలిపి నలభై రూపాయల దాక యిచ్చి వుండవచ్చు. డబ్బు చూసుకున్న తరువాత ఆ అమ్మాయి కొద్దిగా తేరుకున్నట్లు కనిపించింది. "పోనీలే పాపం" అనుకున్నాను.

"స్టేషను నుండి ఒక్కదానివీ వెళ్ళగలవా" ఓ ముసలాయన అడిగాడు.

"వెళతాను" అన్నట్టుగా తలూపింది.

నాకు సికింద్రాబాద్‌లో అర్జెంటు ఆఫీసు పని వుండిపోయింది. అదీగాక శెలవు కూడ లేదు. మళ్ళీ నేను తిరిగి రాత్రికే విజయవాడ చేరుకోవాల్సి వుంది లేకుంటే హైదరాబాద్ వరకూ ఆ అమ్మాయితో వెళదామనే అనుకున్నా. టి. టి. ఇ. కు ఆమె విషయం చెప్పి వుంచాను. ట్రెయిన్ సికింద్రాబాద్ చేరుకునేసరికి రెండయింది. దిగిపోతున్నపుడు వస్తానన్నట్టుగా ఆమెవేపు చూశాను. తలూపుతూ మరోసారి చూసింది—కృతజ్ఞతా భావంతో.

## చెర వదిలింది...

కొండలు పగలేసినా
గుండెలు బలి చేసినా
కాదు కాదు యీ సౌరాజ్యం
నీవు కోరే సమ సమాజం
లంచగొండులు పీఠమెక్కి
వంచనల సూత్రాలు మెక్కి
బీద బిక్కిని అణగద్రొక్కి
గాలిమేడల కబ్జా ప్రభుత్వంలో
పోయిన నీ ప్రాణమంత నిజం
రాదు రాదు నవ సమాజం
ఫాసిస్టు ప్రభుత్వపు విషకౌగిలిలో
కమిలిపోయి కరిగిపోయిన రాజూ,
నీ చెర వదిలింది...
మా చెర మిగిలింది...

— రమణశ్రీ

ఆంధ్రపత్రిక దినపత్రికలో
ఆడవాళ్లకి అన్నీ ఆకర్షణలే వెలువడుతున్నాయి!

# వివాహ వేదిక

(ప్రకటనదారులకు కొత్త అవకాశం)

రోజు రోజుకు సాంఘిక వ్యవస్థ, వివాహ తీరుతెన్నులు మారుతున్నవి మారుతున్న ధోరణులకనుగుణంగా వివాహ సంబంధాల గూర్చి తగు సమాచారము సేకరించుటలో క్లిష్టత, త్రిప్పట, వ్యయం అధికమవుతున్నవి

వధూవరుల కొరకు సమాచారము పత్రిక ద్వారా అందజేసుకోవడం వల్ల కొంత ఈ సమస్యకు పరిష్కారము కాగలదు ఈ దృష్టితోనే ఆంధ్రపత్రిక (దినపత్రిక) లో వధూవరులను గూర్చిన ఒక ప్రకటనల వేదికను ప్రచురించదలచినాము మామూలుగా అయ్యే చార్జీలపై 50/ రాయితీతో అంటే మామూలు సంగ్రహ ప్రకటనలకు లైనుకు రూ. 6 లు చార్జీకి బదులు ఈ ప్రత్యేక కాలంలో లైనుకు రూ. 3–00 వంతున చార్జీ వుంటుంది (లైనులో సుమారు 15-16 అక్షరములు ఇమడగలవు) నాలుగు లైన్లకు తక్కువ లేకుండా ప్రకటన వుండాలి.

మీ ప్రకటన విషయము + చార్జీలను మనీ ఆర్డరు/ డ్రాఫ్టు ద్వారా జతపరచి (బాక్సు నెంబరు కోరేవారు అదనంగా రూ 5 లు చెల్లించాలి)

ఆంధ్రపత్రిక
గాంధీనగరం, విజయవాడ-3
లేదా
బషీర్ బాగ్, హైదరాబాద్-29కు,
పంపవచ్చును



# ఇదో దారి

అది జరిగిన నెల రోజుల కనుకుంటాను— బంధువుల్లో ఒకరి వివాహానికి నెల్లూరు వెళ్లాల్సి వచ్చింది. నాతోపాటు నా కొలీగ్ నాయుడు కూడా నెల్లూరు వస్తున్నాడు. అతనికి అక్కడేదో పర్సనల్ వర్క్ వుందట. మంచి కంపెనే యిస్తాడు... మాటల్లోనే నెల్లూరు వచ్చేసింది. ఇద్దరం ట్రెయిన్ దిగి ప్లాట్‌ఫాం మీద నడుస్తున్నాం. మా పక్క బోగీలో ఏదో గలాటా జరుగుతున్నట్టుంది. కొందరు ఒకచోట గుమిగూడి వున్నారు. 'అదేంటో చూద్దాం పద' అన్నాడు నాయుడు. నేనూ అతనితో కదిలాను... ఎవరిదో అమ్మాయిది పర్స్ పోయిందట... ఆ అమ్మాయి మద్రాసు వెడుతోంది. పర్స్‌లో టికెట్‌తోపాటు డెబ్భై రూపాయల దాకా వున్నాయట! జనాన్ని త్రోసుకుని ముందుకు వెళ్లాను...

"ఆల్చిప్పల్లాంటి ఆ కళ్లల్లో కన్నీళ్లు చోటు చేసుకున్నాయ్..."

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను.

ఆ రోజు నేను సికింద్రాబాద్ వెళుతూ చూసిన అమ్మాయే!

నా కళ్ళు నన్ను మోసం చెయ్యలేవు.

ఆమె కళ్లెత్తి పైకి చూసింది.

ఆ కళ్లల్లో ఎటువంటి తొట్రుపాటులేదు.

"అతనెవరో పాపం పది రూపాయలిచ్చి ఆదుకున్నాడు" అన్నారెవరో.

అటువేపు చూసాను.

విచిత్రం!

తెల్లటి ధోవతి, తెల్లటి లాల్చీ, పైన కండువా!

పెద్దమనిషిలా, ఉన్నవాడిలా వున్నాడు— అతనే!!...

ట్రెయిన్ కదలటంతో హడావుడిగా క్రిందికి దిగి వచ్చేశాను...

నడుస్తూ దారిలో నాయుడికి నా అనుభవం చెప్పాను.

అంతా విని నాయుడు; "ఇలాంటి వాళ్లుండబట్టే, నిజంగా సఫరయ్యే వాళ్ళకు కూడ మనలాంటివాళ్ళు సహాయం చేసేందుకు సందేహిస్తున్నారు. నిజంగా సఫరయ్యేవాళ్లు అవుతూనే వున్నారు. దేశమే ఇలా వుంది" అన్నాడు.